# ఎవరు ముద్దాయి

దాపు అరగంట పైగా అధ్యక్షుల వారిని కలుసుకోవడానికి ఎదురు చూస్తోంది సహజ. వెయిటింగ్ రూమ్ పెద్ద ఎ.సి. హాలు. దానిలో మెత్తని సోఫాలు అమర్చి వున్నాయి. నేలమీద ఖరీదైన కార్పెట్స్! అయినా ఎక్కణ్నుంచో దుర్గంధం నాసికా రంధ్రాలు పగల గొడ్తోంది.

రుమాలుతో ముక్కు మూసుకున్నా దుర్గంధం ఆగటం లేదు. దానికేదో తాంత్రిక శక్తి వున్నట్లు అన్ని అవాంతరాలూ చీల్చుకుని రాగలిగినట్లు ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అక్కడ యింకా చాలా మంది వున్నారు. దుర్గంధమే లేనట్లు, ఉన్నా వాళ్ళ కేమీ సోకనట్లు హడావిడిగా తమ పనులు చేసుకుపోతున్నారు.

కళ్ళా-కాళ్ళా-మనసూ-అన్నీ టకటక-టకటక-టక టక-టక-టక-టక-వికృతమైన ధ్వనులు-లయలేని శృతి బద్ధం కాని ధ్వనులు పైకి రాలేక గిజగిజలాడుతున్నట్లున్న ఘోషలు అన్నీ కలిపి టకటక-టకటక-వాళ్ళు మనుష్యులేకానట్లు ఎవరో "తాంత్రికుడు" నిర్మించిన 'రోబట్స్' అయినట్లు తమని తామే బ్రెయిన్ వాష్ చేసుకున్నట్టు సెల్ఫ్ హిప్నోటిజమ్‌లో నిద్రపోతున్నట్టు టక-టక-టక-

"అధ్యక్షుడు గారు మిమ్మల్ని పిలుస్తున్నారు" ప్యూన్ వచ్చి చెప్పాడు.

ఉలిక్కిపడి లేచింది-ప్యూన్ తలుపు ఓరగా తెరిచాడు. లోపల్నించి గాలి తెర-భరించరాని దుర్గంధం ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేస్తూ రుమాలుకాని, పైట కొంగుకానీ, చివరికి దుప్పటి కాని అడ్డుకోలేని దుర్గంధం- మృత్యువంత చల్లగా-ఏవో చీకటిలోకాలలో ఆవరించు కున్న వెలుగు సోకని శైతల్యం పైకి చిమ్ముకొస్తున్నట్లు గజగజ వణికిస్తూ అస్తిత్వాలు మెలిపెట్టేసే చల్లదనం...

ఎంత అదటునైనా జయించే గుండె నిబ్బరంతో ముందుకే అడుగులు వేసి "నమస్కారం" అంది-అధ్యక్షుడు కళ్ళెత్తకుండానే "కూచో" అన్నాడు. కూచుంది. మెత్తని ఆ కుర్చీ పాము చుట్టలా బుసబుసలాడింది-ఏదో విషవాయు ప్రసారం. రెండు నిమిషాలు గడిచాక చేతిలో కాగితాలు పక్కకు పెట్టి కళ్ళు పైకెత్తాడు. ఆ చూపుల్లోంచి కర్కోటక కిరణ ప్రసారం నననాడులూ గుచ్చే విషగుచ్ఛాలు-

"ఏమిటో చెప్పు" అన్నాడు-అది ఒక్క గొంతే, కాని ఆ గొంతులో కొన్ని కోట్ల గొంతులు కలగలిపి వినిపిస్తున్నాయి- అన్నీ పరిచయమైన గొంతులే. కానీ ఎవరివి? ఎక్కడ వింది?

వెనక్కి వాలాడు కుర్చీలో నల్లటి యూ-ఫోమ్ దిళ్ళున్న కుర్చీ అటూ ఇటూ ఊగింది-వేయి పడగలతో కర్కోటకుడు కస్సుమని లేచి కాటు వేయటానికి కాచుకుని ఉన్నట్లుగా ఊగుతోంది.

"ఏవిటో చెప్పు"

ఆ గొంతు తనలో కోటి గొంతులు కలుపుకున్నట్లు ఎంతో బొంగురుగా వుంది. చూపుల్లోని కర్కోటక కిరణాలు ఎదుటి వ్యక్తిని అంచనా వేస్తున్నాయి. చీల్చి చెండాడాలని, రక్తం పీల్చాలని, సుకుమారమైన ఆ అందాన్నంతా నెత్తుటి ముద్దగా మార్చాలని ఉబలాట పడుతున్నాయి.

ఆ చూపులు చీల్చుకుంటూ ఎన్నో గొంతులు ధిక్కరిస్తూ దుర్గంధాలను విదిలిస్తూ గొంతు విప్పింది సహజ.

"హేమావంత్‌గారు అనవసరంగా నా వెంటపడి వేధిస్తున్నారు. తగిన చర్య తీసుకోండి."

"కహ కహ" నవ్వాడు. బాణం దెబ్బతిన్న లేడి కూనలు తప్పుకోవటానికి చేసే ప్రయత్నాలు చూసి వేటగాడు నవ్వినట్లుగా వుంది.

"ప్రొఫెసర్ హేమావంత్ మీద రిపోర్ట్ చేస్తేంటే నన్నేం చెయ్యమ? నీ దగ్గర సాక్ష్యం వుందా?"

నిండు కొలువులో ద్రౌపదిని కీచకుడు తన్నాడు. ద్రౌపది న్యాయం చెయ్యమని అడిగింది. విరటుడు "తగిన సాక్ష్యం వుంటే చెప్పు. నేరస్థుణ్ని శిక్షిస్తాను" అన్నాడు.

సభలో ఒక్కడు కూడా నోరు మెదపలేదు-ఆనాటి నుంచీ ఈనాటి వరకూ ఇలాంటి కేసులన్నీ ఇంతే! సాక్ష్యాలు ఎక్కడ తేగలరు ఆడవాళ్ళు?

"సంయుక్తామేడమ్ చూసారు-ఆవిడ సాక్ష్యం చెప్తారు."

"మీ మేడమ్ ప్రొఫెసర్ హేమావంత్‌కి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్తారా?"

"ఏం జరిగిందో అది చెప్తారు."

కనుబొమలు చిట్లించి చూసాడు. పద్దెనిమిదేళ్ళ సహజ-పేరుకు తగినట్లు స్వచ్ఛంగా మమతలు పోతపోసినట్లున్న సహజ-ఆ చూపులకి గడగడ వణికింది. విష వాయువులు ఒక్కసారిగా మరింత చిక్కగా మీదికి ఉరికినట్లైంది. నవ్వాడు. కోటికత్తులు ఒకేసారి పదును పెడుతున్నట్లు ధ్వనిచేస్తున్న ఆ 'కహ కహ' నవ్వు శ్మశానంలో పిశాచాల యుద్ధ ఘోషలా పరిసరాలన్నీ ఆవరిస్తోంది. ఈ నవ్వుకంటె అతని కోపం మెరుగనిపిస్తోంది.

"నువ్వు సూర్యంతో సినిమాలకీ షికార్లకీ తిరుగుతావట కదా! ఎక్కడ చూసినా మీరిద్దరూ జంటగా కనిపిస్తారట కదా!"

"అవును. సూర్యం నా స్నేహితుడు. అయితే..."

"అయితే యింకేమిటి? పెద్ద పతివ్రతలాగ మాట్లాడతావేమిటి? సూర్యంతో కలిసి తిరగ్గా లేనిది హేమావంత్‌తో సరసమాడితే తప్పేమిటి?"

నిర్ఘాంతపోయింది-

"ఆడది మొగవాడి సొత్తు. మొగవాడు నిర్మించిన సంఘానికి సొత్తు" ఏదో ధ్వని గట్టిగా-అది ఎన్నెన్నో గొంతుల ప్రతిధ్వని.తరతరాలుగా వినిపించే గొంతు. ఆ కలగాపులగపు ప్రతిధ్వని-

"నేను హేమావంత్ చేత నీకు క్షమార్పణ చెప్పిస్తా. నీకు స్కాలర్‌షిప్ వచ్చేలా చూస్తాను. కాని..."

ఊపిరి బిగబట్టింది-తరువాతి మాటలు అతడనకుండానే తెలిసిపోతున్నట్లున్నాయి.

"నన్ను కూడా సినిమాకి పిలవకూడదూ? పోనీ నువ్వే మా కంపెనీ గెస్ట్‌హౌస్‌కి రాకూడదూ?"

తల కిందికి వాల్చుకుంది-ఈ వ్యవస్థలో రక్షకులెవరు? మొత్తం వ్యవస్థనే అప్పడంలా నంజుకు తినేదెవరు? లేచి బయటికి నడిచింది. గాలిలో కానరాని చురకత్తులు మీదిమీదికొస్తున్నాయి.

"ఎక్కడికెళ్తావు? నన్నెలా తప్పించుకుంటావు?"

సవాలు చేస్తున్నట్లు అన్ని వైపుల నుంచీ అధ్యక్షుడి గొంతు-యుగయుగాలుగా ఎన్నో గొంతులను తనలో జీర్ణించుకున్న గొంతు-ఆ గొంతును వెన్నంటి నవ్వు తెరలు..అలనాటి ఫ్యూడల్ సమాజపు నిరంకుశ రాజులు నిస్సహాయులపై కొరడాలు ఝుళిపించినట్లుగా వున్న నవ్వు తెరలు.

ఎటుపోతోంది కాలం? ముందుకు పోయే కాలాన్ని కష్టపడి పూర్వ యుగాలలోకి ఈడుస్తున్నారా? లేక వెనకటి కాలమే ఎప్పటికప్పుడు మానవాళిని వదలకుండా వర్తమాన భవిష్యత్తులలో జొరబడి పెనవేసుకుంటోందా?

ప్రొఫెసర్ సంయుక్తగారి రూమ్‌లోకి వచ్చింది.

డాక్టర్. సి. ఆనందా రామం



"ఏం జరిగింది?" అడిగింది ఆవిడ-

చెప్పింది జరిగిందంతా. సంయుక్త కళ్ళు ఎర్రబడ్డాయి. మహోద్రేకంతో అధ్యక్షుడి గదికి వెళ్ళింది.

"ప్రొఫెసర్ హేమావంత్ సహజ వెంటపడి అల్లరి చెయ్యడం నేను స్వయంగా చూశాను" అంది దృఢంగా-

తరువాత అధ్యక్షుడు,సంయుక్త ఏం మాట్లాడుకొన్నారో సహజకి తెలీదు. తనని అంతగా బాధించిన విషవాయువులు సంయుక్తని ఏమీ చెయ్యలేదా? అనుకొంది. అడగలేకపోయింది. బహుశః ఇలా ఎన్నో విషయాలు అందరమూ ఎవరి మటుకు వాళ్ళం మనసులో అనుకుంటూ పైకి మాట్లాడుకోమేమో! నిస్సంకోచంగా మాట్లాడుకోగలిగితే ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యేవేమో!

నిద్రలో సైతం కత్తులు నూరుతున్నట్లున్న "కహ కహ" మనే నవ్వు వదలటం లేదు సహజని.

వారం రోజులు గడిచాయి. హేమావంత్ మీద ఎవ్వరూ ఎలాటి చర్యా తీసుకోలేదు. అతడు మరింత విర్రవీగుతూ సహజని వెంటాడసాగాడు. సహజ సంయుక్తని అడిగింది.

"ఏం చెయ్యగలం? అధ్యక్షులవారిని అడిగాం కదా! ఆయన చర్య తీసుకుంటానన్నారు-ప్రొఫెసర్ మీద చర్య తీసుకోవడమంటే మాటలు కాదు మరి!" తేల్చేసింది ఆవిడ-మతిపోయినట్లైంది-

"నీకేం భయం లేదు-కంప్లైయింట్ చెయ్యి. నీ అండగా నేనుంటాను" అన్న సంయుక్త మాటలేనా ఇవి? తరువాత తెలిసింది-సంయుక్త చెల్లెలికి ఉద్యోగం ఇస్తానని అధ్యక్షుల వారన్నారు. అక్కడితో సంయుక్త అంతరాత్మ నిద్ర పోయింది. ఇంకా తెలిసింది హేమావంత్ రాజుగారి బావమరిదిలాంటివాడు. అంటే అధ్యక్షుడి ఉంపుడుకత్తెలాంటి గర్ల్‌ఫ్రెండ్‌కి అన్న. అంటే ఈ రాజ్యంలో- అంటే ఈ సంస్థలో అతనికెదురు లేదు. భారతకాలంనాటి కీచకుడిలా-మృచ్ఛకటిక కాలం నాటి శకారుడిలా యథేచ్ఛగా అత్యాచారాలు సాగించగలడు. తన మాట నెగ్గించుకోగలడు. అలెగ్జాండర్‌లా, గజనీ మహమ్మదులా, ఔరంగజేబులా, హిట్లరులా, ముస్సోలినిలా నియంతృత్వ పాలనకు అలవాటు పడ్డ ప్రభువు. అంటే అధ్యక్షుడు, కేవలం తన ఇచ్ఛానుసారం ఒక సంస్థని పరిపాలించుకొంటాడు. ఒంటరిగా ఈ మహాశక్తిని ప్రతిఘటించలేదు. అందరూ సంఘటితమయితే ఈ శక్తులన్నీ దూదిపింజల్లా తేలిపోతాయి. కానీ అలా ఏనాడూ జరగదు-కారణం?

మానసిక కల్లోలాన్ని భరించలేక భగవంతుణ్ణి ఆశ్రయించాలని దేవాలయానికి వెళ్ళింది సహజ. అక్కడ-

అదెవరూ? పూజలందుకుంటున్న ఆ శక్తి ఎవరు? దేవుడు కాదు-ఆ కళ్ళలోంచి విధ్వంసకిరణాలు-చుట్టూ చేరిన భక్తుల పంచ 'మ' కారపూజలు? ఆ పూజ లందుకుంటూ ఆ శక్తి చేస్తోన్న వికటాట్టహాసాల "కహ కహ" ధ్వనులు.

ఎన్నో కోట్ల కర్కశ స్వరాలు తనలో మేళవించుకొన్న ఆ నవ్వు ఇదివరలో విన్నదే. ఆ చూపులు యుగయుగాల దౌష్ట్యాన్ని లోలోపల మరిగించుకొని కిరణాలుగా ప్రసరిస్తున్నాయి. ఆ విద్యుద్ఘాతాత్మక కిరణాలలో ఇదివరలో ఎన్నెన్ని జన్మలు కుప్పగా కూలిపోయిందో? ఏ మహా చైతన్య శక్తి పునరుజ్జీవన బలంతో యుగయుగాలుగా మళ్ళీ జన్మనిస్తుందో కాని ఎప్పటికప్పుడే వేషం మార్చుకుని తలెత్తిన చైతన్యానికి తలకొట్టేయాలని ప్రయత్నిస్తున్నాయి. దేవాలయంలో కూడా ఇతనేనా?

"ఎవరు నువ్వు?" అడిగింది.

"కహ కహ" మంటూ నవ్వు. అదే సమాధానమన్నట్లు అర్థమౌతోంది. అర్థం కానట్లుగానూ వుంది. భాష యేర్పడకముందే మానవ సమాజం ప్రారంభమైననాడే పుట్టిన నవ్వది-ఆ నవ్వులోని వికట విశృంఖల స్వరాలలో ఎన్నెన్నో యుగాల మానవుని స్వార్థపూరిత

# అశాంతి రేఖ మీటించి

ఈ అశాంతికి ఒక లిపి వుంది
ఈ కన్నీటికి ఒక భాష వుంది
నేను సముద్రాన్నై ఎగిసినప్పుడు
ఈ అల వెనుక ఒక ఘోష వుంది
అడుగు అడుగుకీ ఘనీభవించే
ఆలోచనలో ఒక బాధ వుంది

ఈ రణ రంగం మధ్యన నువ్వు
అణువణువూ విరిగిపోతున్నప్పుడు
నేను ప్రేక్షకుడ్ని —
నన్ను ఆప్యాయంగా పొదువుకున్నప్పుడు
నేను ప్రపంచాన్ని —
రోజులు ఎంతగా కోసినా
ఒక్క నెత్తురు చుక్క కనిపించదు
దాటిపోతున్న ప్రతి అడుగు
అసహనాన్నే పెంచుతుంది
ఈ గుప్పిట తెరుచుకునే సరికే
చూపులు కాయలైపోతాయి
చివరి చూపు సముద్రమై ఆగిపోతుంది

ఏ పంజాయిషీ నీకు భరణంగా ఇవ్వలేను
నాకు తెలుసు
ఏ ఓదార్పూ నిన్ను మభ్యపెట్టలేదు
ఈ క్షణమే అశాంతి మీద
యుద్ధం ప్రకటించలేను
ఈ క్షణమే ఈ చిదుగుల్ని పేర్చి
వెచ్చటి వెలుతురులా మండలేను
ఇప్పుడిక నిర్ణయం తీసుకోవాలి
ఈ కూడలిలో మార్గాన్ని ఎంచుకోవాలి
ఈ వర్షపు చినుకు సాక్షిగా
ఈ సముద్రాన్ని ఇక నేనే మోయాలి
ఈ శిథిలపు గోడమీద
సంగీతపు స్వరాల్ని నేనే పలికించాలి
ఈ చీకటి ఖండం మీద
వెలుతురులా నేనే మళ్ళీ కాలుమోపాలి

**యాకూబ్**

లాలసత్వపు విషమయ వాంఛా భావనల ప్రతీకాత్మక ధ్వనులు.

తను ఉంది-ఆ నవ్వూ ఉంది-తను పారిపోతోనే ఉంది- ఆ నవ్వు వెంబడిస్తోనే ఉంది.

తల తిరిగినట్లయింది. వైద్యం కోసం విశ్రాంతి కోసం హాస్పిటల్‌కి వెళ్ళింది. ఎలుగెత్తి పిలిచినా ఎవరూ పలకటం లేదు. ఇక్కడకూడా అందరూ బ్రెయిన్ వాష్ చెయ్యబడ్డ వాళ్ళలాగ, సెల్ఫ్ హిప్నటైజ్ చేసుకున్న వాళ్ళలాగ ఏదీ చూడకుండా, ఏదీ వినకుండా, ఏదీ పట్టించుకోకుండా ఎవరో ఇస్తోన్న సిగ్నల్స్ ప్రకారం కదుల్తున్నారు. మూసి వున్న తలుపులు తోసింది.అక్కడా అధ్యక్షుడే! సూపర్నెంట్ వేషంలో! చూపుల్లో అవే భస్మీకరణ కిరణాలు! అదే "కహ కహ" నవ్వు.డబ్బుల సంచుల గలగలలు. రహస్యంగా అమ్ముకున్న మందుల డబ్బులు. డబ్బున్న పేషెంట్స్ దగ్గిర లంచంగా తీసుకున్న డబ్బులు! పేదల "గుండెల నెత్తురులు"! డబ్బులుగా మారిన గలగలలు! "కహాకహా" నవ్వులు కర్కశ ధ్వనులు! భరించలేని కుళ్ళిపోయిన భావజాల దుర్గంధాలు!

పరుగు! పరుగు! ఒకటే పరుగు!

ఎక్కడికి పారిపోయినా అదే నవ్వు. అదే దుర్గంధం!

ఎక్కణ్ణించో వినిపిస్తోంది ఈ నవ్వు? ఎక్కడ? ఎక్కడ? గుర్తించింది. గజగజ వణికింది. అది తన మనసులోంచే!

"ఎవరు నువ్వు?"

సమాధానంగా అదే నవ్వు-

"ఆ తెలిసింది. పాశ్చాత్యులు నిన్ను "సైతాన్" అంటారు. భారతీయులు "కలిపురుషుడు" అంటారు. ఇంకా నీకు చాలా పేర్లున్నాయి. ఎందరెందరో కవులు, రచయితలు నిన్ను గుర్తించి బయట పెట్టాలని ప్రయత్నిస్తోనే వున్నారు. పో! బయటికి పో!"

"శభాష్! నన్ను గుర్తించావు- "పో! పో!" అని అరిస్తే నేను పోతాననుకుంటున్నావా? నన్ను రాక్షసుడిగా సృష్టించుకుని మీరల్లుకొన్న జానపద గాథల్లో నా ప్రాణం సప్త సముద్రాల అవతల ఏ చెట్టు తొర్రలోనో, ఏ మంత్ర శక్తుల మధ్యనో వున్నట్లు ఊహించుకున్నారు. మీ ఊహల్లో ఎలాగో సముద్రాలు దాటేసి నా ప్రాణాలు చేజిక్కించుకున్నారు. నిజానికి అంత ప్రయాస అక్కర్లేదు. నైతిక బలం వున్న ఒక వ్యక్తిని నా ముందు నిలబెట్టు. నేను మాయమవుతాను. ఊహల్లో సముద్రాలు దాటానుకున్నారేకాని, ఈ ప్రయత్నం మాత్రం చెయ్యలేదు- ఏదీ నువ్వు ప్రయత్నించు"

మనసులో గొంతు సవాల్ విసిరింది.

పరుగు ఆపింది. పట్టుదల పెరిగింది.

స్త్రీ స్వాతంత్ర్యం కోసం పోరాడే మహిళా మణిని కలుసుకుంది. ఆవిడకున్న నైతిక బలంతో వ్యవస్థ అంతటా పరచుకొన్న ఆ విధ్వంసక శక్తిని ఎదుర్కోమని కోరింది. అంతావిని చప్పరించేసింది ఆ వీరనారి.

"ఏవో వరకట్న సమస్యలూ, కట్నం చావులూ- పెళ్ళి మీద పెళ్ళిళ్ళూ లాంటి గృహ సంబంధమైన సమస్య అయితే పరిష్కరించటానికి పూనుకొంటాము. కానీ హమ్మో! ఈ శక్తికి ఎదురు నిలవటమా? ఇది ఏమైనా చెయ్యగలదు. నాకిద్దరు చిన్న పిల్లలున్నారు. భర్త వున్నాడు. వాళ్ళకేమైనా అయితే నేను భరించలేను. నేను రాలేను. నువ్వు ఈ ప్రయత్నం మానుకో!"

సహజ నిరుత్సాహ పడలేదు. ఇంతకంటే గొప్ప సమాధానం ఆమె ఆశించలేదు.

విప్లవ నాయకుడిగా పేరుబడ్డ ప్రజా నాయకుణ్ని కలుసుకుంది.

"ఊహాశక్తిని ఎదుర్కోండి-మీరే విప్లవాలూ తీసుకు రానక్కర్లేదు-నిజమైన ప్రజా రాజ్యం సాధించగలరు" అంది.



అతడు బట్టతల తడుముకున్నాడు.

"నువ్వు చెప్పింది కాదనలేను. కానీ ఈ శక్తిని ఎదుర్కోవటంవల్ల మొదట్లోనే మా బలగం నాశనమవుతుంది. మొదట ప్రభుత్వాధికారం సంపాదించుకోవాలి. ఆతర్వాత ఇలాంటి శక్తులని మేమంతా కలిసి అణిచివేస్తాం. కాస్త ఓపిక పట్టండి. అప్పటి వరకూ మీరంతా మాకు సహకరించండి" అన్నాడు. గిరున తిరిగి వెళ్ళిపోయింది. చేయవలసింది చేయలేకపోతున్నాననే బాధతో అతడు మనశ్శాంతి కోసం విస్కీ గ్లాసు అందుకున్నాడు.

సహజ అంతరాంతరాల్లోంచి మాతిలోని గొంతులా సన్నగా ఏదో గొంతు ప్రబోధించింది.

"వాళ్ళని వీళ్ళని ప్రాధేయ పడతావు దేనికి? నువ్వే ఎదిరించరాదూ?"

సహజ పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఒక్కొక్క అడుగే ముందుకు వేసింది. ఈ ప్రయత్నంలో తను విజయం సాధించలేక పోవచ్చు. సమూలంగా నాశనం కావచ్చు. అయినా పర్వాలేదు. ఎప్పుడో మళ్ళీ పుట్టినప్పుడు ఈ శక్తి లేని మరో ప్రపంచాన్ని చూడగలదేమో!

## అంకితం

*ఓ మహాశక్తీ!*

*నా అసమర్థతను ఎత్తిచూపి నన్ను అవహేళన చేసి, నిన్ను ఎదుర్కోవలసిన అవసరాన్ని గుర్తు చేశావు-అందుకే, ఇది నీకే అంకితం-.*

— ఆనందారామం